క్లుప్తంగా

పోలిపాడ్యమికి ఏర్పాట్లు

- నదుల వద్ద జ్యోతులు వెలిగించనున్న భక్తులు

మాడుగుల రూరల్ : పోలిపాడ్యమిని పురస్కరించుకుని సోమవారం శివాలయాలు వద్ద భక్తులు పూజలు, నిర్వహించనున్నారు. అలాగే నదుల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి మహిళలు అరటిదొప్పల మీద దీపాలు వెలిగించి నదుల్లో విడవనున్నారు. కె.జె.పురం, వీరవల్లి, వీరనారాయణం, జంపెన, మాడుగుల, వంటర్లపాలెం, తదితర గ్రామాలల్లో తాచేరు నది ఒడ్డున అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ధూప, దీప, స్వయం పాక దానాలు కూడా ఇవ్వనున్నారు ఆదివారం కార్తీక అమావాస్య సందర్భంగా ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



చౌడువాడలో బ్రహ్మంగారి మందిరంలో పూజలు చేస్తున్న శివాజీరాజు, తదితరులు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద నిర్వహించిన ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలను నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున బ్రహ్మంగారికి ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల ముగంపు సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు ప్రత్యేక పూజలు చేశారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎ. కొత్తపల్లిలో వేరుశనగ విత్తనాలను అందజేస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ

దేవరాపల్లి : ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న విత్తనాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ఆదివారం జరిగిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులకు ఆయన చేతుల మీదుగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. వకార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎ. దివ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయం ఉప సంహరించుకోవాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి

రోలుగుంట : హామీలు తుంగలో తొక్కి పెంచిన విద్యుత్ చార్జీల నిర్ణయం వెంటనే ఉప సంహరించుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీల అమలులో విఫలం కావడమే కాకుండా కరెంటు చార్జీలు పెంచడం బాధాకరమన్నారు. యూనిట్ రూ.92లకు పెంచడం అన్యాయమన్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.7,912 కోట్లు భారం పడుతుందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే విద్యుత్ ఛార్జీలు పెంచడం శోచనీయమని , ఇచ్చిన హామీకి కట్టుబడి వెంటనే చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని అన్నారు.

మందుబాబుల జేబుకు చిల్లు

- వీధికో బెల్టు షాపు
- గుట్టుగా అనధికార మద్యం విక్రయాలు
- బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అదనం



బెల్టు షాపు నిర్వాహకుడి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో నర్సీపట్నం రూరల్ పోలీసులు (ఫైల్)

నర్సీపట్నం : ఎమ్మార్పీని మించి అధికంగా మద్యం విక్రయించినా అనధికారికంగా నిల్వచేసినా..అమ్మినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల హెచ్చరించినా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు పుట్టుకొస్తున్నాయి. రాత్రి, పగలూ తేడా లేకుండా అక్రమ మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. వ్యాపారులు వీధికో బెల్టు షాపు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక క్వార్టర్ సీసాపై నిర్ణీత ధరకు మించి రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని తుంగలో తొక్కుతున్నారు.

నిబంధనలు బేఖాతరు

కొద్ది రోజుల కిందట లాటరీ విధానంలో మద్యం దుకాణాలను కేటాయించారు. మద్యం ప్రియులను బెల్టు షాపుల నిర్వాహకులు దోచుకుంటున్నారు. చాలా చోట్ల షాపులు అందుబాటులో లేపోవడంతో బెల్టు దుకాణాలకు కలిసి వస్తోంది. కొన్ని గ్రామాల్లో దుకాణాలు దూరంగా ఉండడంతో అందుబాటులో బెల్టు షాపులు తెరిచి బహిరంగంగానే అమ్మకాలు సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలో 7, నాతవరం 4, గొలుగొండ 4, మాకవరపాలెం 4, నర్సీపట్నం రూరల్ 2, మొత్తం 21 మద్యం షాపులకు అనుమతులు ఇచ్చారు. ఇవి ఎక్కడెక్కడో ఉండడంతో వాటి పరిధిలోని అన్ని గ్రామాల్లో నాలుగు నుంచి ఆరు వరకు బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. వీరు నిబంధనలకు నీళ్లు వదిలి అక్రమంగా మద్యం విక్రయాలకు పాల్పడుతున్నారు.

నియోజకవర్గంలో 180పైగానే...

నర్సీపట్నం, గొలుగొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 21 మద్యం షాపులకు ప్రభుత్వం లైసెన్స్‌లు మంజూరు చేసింది. వీటి పరిధిలో బెల్టు దుకాణాలను బడి, గుడి, ప్రభుత్వ కార్యాలయం అనే తేడా లేకుండా ఏర్పాటు చేసి జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి వైన్‌షాపుకు సమీపంలో మెయిన్‌రోడ్డును అనుకొని పాన్‌షాప్ నిర్వాహకుడు పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి, బెల్టు దుకాణం నిర్వహిస్తున్నాడు. పాన్‌షాపుల నిర్వాహకులు మద్యం వ్యాపారులతో లింకుపెట్టుకుని బెల్టు షాపులు నడుపుతున్నారు. ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలిసాయి. నియోజకవర్గంలోని దాదాపు 180కు పైగా బెల్టు షాపులు తెరిచారంటే వ్యాపారం ఏస్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసు, ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపుల నిర్వాహకులపై కేవలం 20 కేసులు నమోదు చేశారు. ఈ మధ్య కాలంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు అక్కడక్కడ దాడులు చేస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో విక్రయాలను నియంత్రించే ప్రయత్నం చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

విస్తృతంగా దాడులు



కొద్ది రోజులుగా బెల్టు షాపులపై దాడులు చేస్తున్నాం. నర్సీపట్నం సర్కిల్ పరిధిలో 10 కేసులు నమోదు చేశాం. ఈ కేసుల్లో 160 మద్యం బాటిళ్లు, ఏడు బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకున్నాం. 11 మంది పాత నేరస్తులపై బైండవర్ కేసులు పెట్టాం. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటాం. నిత్యం సిబ్బందితో ఏదో ఒక చోట తనిఖీలు చేస్తున్నాం. బెల్టు షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తాం. బెల్టుషాపు నిర్వాహకుడు మొదటిసారి పట్టుబడితే స్టేషన్ బెయిల్, రెండవసారి పట్టుబడితే రిమాండ్ విధిస్తాం.

సునీల్ కుమార్ (ఎక్సైజ్ సీఐ, నర్సీపట్నం)

తుపాను వర్షాలకు నేలరాలిన వరి పనలు

ఆందోళన చెందుతున్న రైతులు

మాడుగుల/మాడుగుల రూరల్ : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కోసిన వరి పనలు తడచి ముద్దవుతున్నాయి. నీటిలో మునిగిన వరి వెన్నులు మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సత్యవరం, జంపెన, వొమ్మలి, కింతలి, అవురువాడ, ఎం.కోడూరు, శంకరం, తాటిపర్తి, తదితర గ్రామాల్లో రైతులు సుమారు 500 ఎకరాల్లో వెన్నులు రాలిపోవడంతో తప్పని పరిస్థితిలో వరి కోతలు కోశారు. తుపాను వర్షాలకు పొలాల్లోనే వరి చేలు తడుస్తున్నాయి. కుప్పలు పెట్టిన ధాన్యం పాడవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి వాసుదేవరావును సంప్రదించగా వరి పనలున్న పొలాల్లో నీటి నిల్వలు లేకుండా కాలువలు చేసుకుని తడిచిన వరి పనులుపై 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే మొలకలు రాకుండా కాపాడుకోవచ్చున్నారు. మండలంలో 11వేల ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట వేశారు.

దేవరాపల్లి : మండలంలో రెండు రోజులుగా కురిసిన మోస్తరు వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. పంట పొలాల్లో కోసిన వరి పనలు తడిసి ముద్దవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో వేసిన వరి చేను కుప్పలు సైతం తడిసిపోయాయి. దేవరాపల్లి, కాశీపురం, పెదనందిపల్లి, చిననందిపల్లి, మారేపల్లి, తారువ, కొత్తపెంట, ఎం.అలమండ తదితర గ్రామాల్లో పంట తడిసిపోయింది.



సత్యవరం గ్రామంలో తడిచిన వరి చేలు ఒడ్డుకు చేర్చుతున్న రైతు చినబాబు



సత్యవరంలో తడిచిన వరి పనలు పట్టుకుని బోరుమంటున్న రైతు



కె.జె.పురంలో కోసిన వరి పంట



దేవరాపల్లి : కాశీపురంలో తడిసిన వరి పనలు



మాడుగులలో కురుస్తున్న వర్షం

విలువల పరిరక్షణే ధ్యేయంగా సుపథ పరీక్షలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం : రెండు దశాబ్దాలకు పైగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, మానవతా విలువల పరిరక్షణే ధ్యేయంగా సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎంఈవో సిహెచ్.తలుపులు పేర్కొన్నారు. నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలకు ఎంఈవో ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సుపథ స్వచ్ఛంద సంస్థ వారు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలు విద్యార్థుల్లో విలువలు పెంపొందించేందుకు, మాతృభాషపై మక్కువ పెంచేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. 2003 నుంచి ఈ పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పోటీ పరీక్షలకు 320 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాబి మాస్టర్, ఎం.అప్పలనాయుడు, హరికృష్ణ, సింహాచలం, కామేశ్వరరావు, రామయ్య, నాగరాజు, రామకృష్ణ, పార్వతి, రమణ, పాకలపాడు గురుదేవుల ఆశ్రమ నిర్వాహకులు వై.వి.రమణ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి



కె.జె.పురం కళ్యాణ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మాడుగుల రూరల్ : దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించి, నిర్వహణలో సంస్కరణలు చేపట్టాలని జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి కె.జె.పురం కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 5 గ్రామాలకు చెందిన వీహెచ్‌పీ గ్రామ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. జనవరి 5వ తేదీన విజయవాడ సమీపంలో గల గన్నవరంలో జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభకు ప్రతి హిందూ బంధువు తరలి రావాలని కోరారు. హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలనే డిమాండ్‌తో 5 లక్షల మందితో శంఖారావం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు రాపేట రామ కొండలరావు సమావేశానికి అధ్యక్షత వహించారు. వీరనారాయణం రామాలయంలో గ్రామ కమిటీ బాధ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. వీహెచ్‌పీ ప్రతినిధులు పరిమి కాసుల జగ్గారావు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో ప్రయాణికుల ఇక్కట్లు



బురదమయంగా మారిన బి.ఎన్ రోడ్డు

రోలుగుంట : ఇది పొలాలకు పోయే మట్టి రోడ్డు కాదు. బస్సులు, లారీలు తదితర వాహనాలు తిరిగే భీమిలి-నర్సీపట్నం తారురోడ్డు. చినుకుపడితే ఈ రోడ్డులో ప్రయాణం నరకమే. భీమిలి-నర్సీపట్నం రోడ్డులో రోలుగుంట గ్రామంలో ప్రవేశించినప్పటి నుంచి గ్రామం దాటే వరకూ వర్షం పడకుంటే గోతుల మయం, వర్షం పడితే బురదమయం ఇదీ ఈ రోడ్డు దుస్థితి. రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో శని, ఆదివారాలు ఒక మోస్తరు వర్షాలు పడ్డాయి. దీంతో దెబ్బతిన్న ఈ రోడ్డు బురదమయంగా మారి ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రహదారుల సమస్య మెరుగు పరుస్తామనే బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారి మెరుగుపై దృష్టి సారించకపోవడం బాధాకరమని అన్ని వర్గాలు వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్య మెరుగుపై దృష్టి సారించాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బురద రోడ్డులో ద్విచక్ర వాహనదారులు వచ్చి పోయేవారు ఈ రోడ్డులో అదుపు తప్పి బోల్తాపడుతున్నారు. సత్వరం ఇచ్చిన హామీ అమలు పరచి రహదారి మెరుగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నివారణే మార్గం... చైతన్యమే శరణ్యం



మాడుగులలో జాతీయ ఎయిడ్స్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా ర్యాలీ



కె.కోటపాడులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది



బుచ్చింపేటలో ఏఎన్ఎంలతో కలసి ర్యాలీ చేస్తున్న వైద్యులు సునీత ,శ్రీనివాసరావు, నిర్వాహకుడు గణేష్

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీలు

మాడుగుల : ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి నివారణ ఒక్కటే మార్గమని, ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయడానికి సరైన మందులు అందుబాటులోకి రాలేదని మాడుగుల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. హెచ్ఐవీ పాజిటివ్ వచ్చిన వారందరూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు కారని, సరైన మందులు తేలికపాటి వ్యాయామంతో వ్యాధిగ్రస్తులు ఎక్కువ కాలం జీవించవచ్చని తెలిపారు. వైస్ ప్రాన్సిపాల్ జయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామకుమార్, ఉపన్యాసకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కె.కోటపాడు : ఎయిడ్స్ వ్యాధి సోకకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక 50 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.శ్రీలక్ష్మి అన్నారు. ఐసీటీసీ సిబ్బందితో పాటు వైద్యాధికారుల ఆధ్వర్యంలో గ్రామంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని శ్రీలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, కోటేశ్వరరావు, వై.సునీల్, నందకిషోర్, రమ, వైదేహి, రోజారాణి, కుసుమరాణి, ప్రశాంత్, సురేంద్రబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ కె.దేముడుబాబు, టెక్నీషియన్ వి.గంగునాయుడు, సురేష్, అయ్యన్న కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీతో పాటు మానవహారంగా ఏర్పడ్డారు. అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సీమునురు రమణ, గాడి అప్పారావు పాల్గొన్నారు.

రోలుగుంట : బుచ్చింపేటలో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ సందర్భంగా ర్యాలీ చేశారు. ఎయిడ్స్‌ని నిర్మూలిద్దాం-అందరూ సమష్టిగా బాధ్యత వహిద్దాం. అంటూ ర్యాలీలో నినదించారు. ఎయిడ్స్ సంపూర్ణ నియంత్రణ చర్యలకు సంబంధించిన కరపత్రాలను గ్రామంలో ప్రజలకు పంచారు. నిర్వాహకుడు మలసాల గణేశ్వరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యులు సునీత, శ్రీనివాసరావు ,ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం



పెచ్చులూడుతున్న ఎంపీడీవో కార్యాలయ స్లాబ్

గొలుగొండ : ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడి కింద పడడంతో పనిచేస్తున్న సిబ్బంది నరక యాతన పడుతున్నారు. భారీ వర్షం కురిస్తే స్లాబ్ కారిపోవడంతో కార్యాలయానికి సంబంధించిన రికార్డులు తడిచిపోవడం జరుగుతుంది. మూడు సంవత్సరాలు క్రితం జరిగిన ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు కార్యాలయంలో దాచి ఉంచిన సందర్భంగా భారీ వర్షం కురిస్తే బ్యాలెట్ బాక్సులో నీరుపోయి మరళా రీ పోలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కార్యాలయంలోనికి నీరు రావడం జరుగుతుంది. కార్యాలయానికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉల్లాసంగా విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర



విజ్ఞాన విహార యాత్రలో ఎ.కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థుల సందడి

దేవరాపల్లి: విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడమే ధ్యేయంగా వారిని విజ్ఞాన విహార యాత్రకు తీసుకెళ్లామని ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత అన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు ఆదివారం ఉదయం విజ్ఞాన విహార యాత్రలో భాగంగా ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ప్రత్యేక బస్సుల్లో విశాఖ బయలుదేరి వెళ్లారు. విశాఖలోని జంతు ప్రదర్శనశాల, కై లాసగిరి, ఆర్‌కె.బీచ్ తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. టి 20 యుద్ధ విమానం, మ్యూజియం, సబ్‌మెరైన్ తదితర ప్రాంతాలను విద్యార్థులకు చూపించి వాటి గురించి హెచ్ఎం స్వర్ణలత సహా ఉపాధ్యాయులు సమగ్రంగా వివరించారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులంతా సహపంక్తి భోజనాలు చేశారు.



జూపార్క్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి సందడి చేస్తున్న విద్యార్థులు

ప్రమాదాలకు నిలయంగా ఏలేరు సొరంగం బావి

- బావిపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ దొంగలపాలు
- ప్రమాద నివారణ చర్యలపై నిర్లక్ష్యం



ఐరన్ గ్రిల్స్ శిథిలం కావడంతో ప్రమాదకరంగా కన్పిస్తున్న ఏలేరు కాలువ సొరంగం బావి

నాతవరం : ఏలేరు కాలువ సొరంగం బావిపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ శిథిలం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు ఇతర పరిశ్రమలకు జీవీఎంసీ ప్రజలకు తాగునీరు సరఫరా కోసం సుమారుగా 154 కిలోమీటర్ల పొడవున ఏలేరు కాలువ ఏర్పాటు చేశారు. నాతవరం మండలం జిల్లేడుపూడి గ్రామం వద్ద ఎత్తయిన ప్రాంతం కావడంతో ఏలేరు కాలువకు సొరంగం ఏర్పాటు చేశారు. సుమారు 280 అడుగులు లోతులో సొరంగం మార్గం ద్వారా కాలువ తవ్వారు. ఇందుకోసం జిల్లేడుపూడిలో గ్రామ సమీపంలో 15 అడుగుల వెడల్పు 280 అడుగుల లోతులో బావి ఏర్పాటు చేశారు. సొరంగంలో కాలువ పనులు పూర్తి చేశాక ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బావిపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కొందరు బావిపై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్ అపహరించగా, మిగిలిన సామాగ్రి తుప్పు పట్టి శిథిలమైన ప్రస్తుతం బావిపై ఎలాంటి ఐరన్ గ్రిల్స్ లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మేతకు వెళ్లిన పశువులు ప్రమాదవశాత్తూ జారి ఇందులో పడిపోతున్నాయి. ఇటీవల కాలంలో జిల్లేడుపూడి గోవిందపురం వెంకయ్యపాలెం గ్రామాలకు చెందిన పలువురు రైతులు పశువులు సొరంగం కాలువులో పడి మరణించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం పిక్నిక్ పేరుతో సందర్శకులు ప్రమాదకరంగా ఉన్న సొరంగం బావి చూసేందుకు వస్తున్నారు ఏమాత్రం అదమరిచినా ప్రమాదానికి గురవుతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా సొరంగం బావిలో పడితే వారి ఆచూకీ దొరికే పరిస్థితి ఉండదు. ఉన్నతాధికారులు స్పందించి ఏలేరు కాలువ సొరంగం బావిపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రబీ సాగుకు సన్నద్ధం



మాడుగుల మండలం సత్యవరంలో వరి నారు మడులు సిద్ధం చేస్తున్న రైతులు

మాడుగుల : మండలంలో ఈ ఏడాది రైతులు రబీ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఖరీఫ్ వరి చేలు రెక్కతెగులు సోకడంతో వెన్నులు నేల పాలయ్యాయి. తుపాను కారణంగా కొంత ఖరీఫ్ వరి పంటలుకు నష్టం జరిగింది. దీంతో ఖరీఫ్ వరి చేలు నష్ట పోవడంతో రబీ వరి సాగుపై రైతులు దృష్టి సారించారు. మండలంలో 4,600 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు సన్నద్ధం అవుతున్నారు.

ఆశాజనకంగా పెద్దేరు జలాశయం

మండలంలో అత్యంత జలవనరులు గల పెద్దేరు జలాశయంలో సాగు నీరు ఆశా జనకంగా ఉండడంతో జలాశయం పరిధిలో రబీ సాగుకు దిగారు జలాశయం ఆయకట్టు పరిధిలో సుమారు 2 వేల ఎకరాల్లో సాగుకు దిగారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 131 మీటర్లు ఉంది. రబీలో ఆయకట్టు భూములకు ఢోకా లేదని, జలాశయం అధికారులు చెబుతున్నారు.